క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు


పిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ నందు 55 శాతం ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులన్నారు. నెట్, స్లెట్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుకు మొదట ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ 19న ఒరిజనల్ ధ్రువపత్రాలతో డిగ్రీ కళాశాలలో హాజరు కావాలన్నారు. డెమో , ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు.

గ్రంథాలయ వారోత్సవాల కరపత్రం విడుదల


కరపత్రం విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చలపతిరావు, అధ్యాపకులు

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించే వివిధ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామని, విద్యార్థినులు ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రపంచ పరిజ్ఞానం వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని, దీంతో విజ్ఞానం పొందవచ్చన్నారు. అధ్యాపకులు ధర్మరావు, బాలరాజు, డాక్టర్ బలరామ్, ప్రసాద్, డాక్టర్ స్వర్ణలత, దివ్యమోనిక, సంధ్య, అన్నపూర్ణ, శోభన్, అఖిల్, సరస్వతి, లాలికుమారి, రోజా రాణి పాల్గొన్నారు.

చాపరాయిలో కార్తీక పుణ్యస్నానాలు


చాపరాయి జలపాతం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

దుంబ్రిగుడ: పర్యాటక కేంద్రం చాపరాయిలో శనివారం పర్యాటకులు చేరి కార్తీక పౌర్ణమి పుణ్యస్నానాలను ఆచరించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా చాపరాయిలో శుక్రవారం సాయంత్రం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, సమీపంలోని చేపలమ్మ తల్లి గుడిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం సీజన్ కావడంతో చాపరాయి పర్యాటకులతో కిటకిటలాడుతోంది. వారాంతంలో చాపరాయితో పాటు సమీప ప్రాంతాల్లో పర్యాటకులు సందడి చేస్తున్నారు. వలిసె తోటల్లో ఫొటోలు తీసుకునేందుకు పర్యాటకులు ఎగబడుతున్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్

జి.మాడుగుల: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గురుకులం పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా ఆదేశాల మేరకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అన్ని ఆరోగ్య పరీక్షలను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవిచంద్రశేఖర్ చేశారు.
బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష పుస్తకంలో విద్యార్థులకు తనిఖీ చేసిన ఆరోగ్యం విషయాలను పొందుపర్చారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.ప్రకాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు


సంతలో విక్రయిస్తున్న బస్తరు పిక్కలు


ముంచంగిపుట్టు వారపు సంతలో కూరగాయల వ్యాపారం

- వారపు సంతలో జోరుగా వ్యాపారం
- లాభదాయకంగా ధరలు
- సేంద్రియ పంటలకు గిరాకీ

ముంచంగిపుట్టు: మన్యంలో ఈ ఏడాది వాతావరణం అనుకూలించడంతో కూరగాయలు, ఆకు కూరలతో పాటు వాణిజ్య పంటలను రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పండించారు. ప్రస్తుత సీజన్‌లో కూరగాయల దిగుబడి బాగుంది. ఏజెన్సీలో సేంద్రియ పద్ధతిలో పండించే కూరగాయలు, ఆకుకూరలకు మైదాన ప్రాంతాల్లో గిరాకీ ఉంది. గిట్టుబాటు ధరలు ఉండడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆశాజనకంగా దిగుబడులు

గిరిజన రైతులు పండించే కూరగాయలు, చిక్కుడు జాతి ఉత్పత్తులకు వారపు సంతల్లో మంచి ధర లభిస్తుంది. ముఖ్యంగా సేంద్రియ విధానంలో పంటల సాగు చేయడం దిగుబడితో పాటు మంచి గిరాకీ నెలకొంది. ఖరీఫ్ సీజన్ మొదలుకావడంతో వారపు సంతలో అధికంగా కూరగాయలు, చిక్కుడు జాతి పిక్కల వచ్చాయి. వారపు సంతల్లో మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు కూరగాయలను కొనుగోలు చేస్తున్నారు. దొడిపుట్టు, నర్సీపుట్టు, పెద్దపేట, పేటమాలిపుట్టు, తలబిరడ, వనభసింగి గ్రామాల నుంచి గిరిజన రైతులు శనివారం మండల కేంద్రంలో వారపు సంతకు ఉదయం 8గంటలకే తీసుకువచ్చారు. చిక్కులు, బస్తరు పిక్కలు, టమాటా, చిలగడదుంప, మిరప, నాగలిదుంపలు, క్యారెట్, వంకాయలు, ముల్లంగి వంటి కూరగాయలను అధికంగా సంతకు రైతులు తీసుకువచ్చారు. గిరిజన రైతులు రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండా సేంద్రియ విధానంలో పండిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు కావడంతో గిరిజన ప్రాంత కూరగాయలకు మంచి డిమాండ్ ఉంది. అనకాపల్లి, చోడవరం, మాడుగుల మైదాన ప్రాంతాల వ్యాపారులు వచ్చి పోటీ పడి కూరగాయలకు కొనుగోలు చేసి వ్యాన్లు, ఆటోలు, జీపుల్లో తీసుకొని వెళ్లారు.

గిట్టుబాటు ధరలు

వారపు సంతల్లో గిరిజనులు పండించే కూరగాయలకు మంచి ధరలు లభిస్తున్నాయి. బస్తరు పిక్కలు గ్లాస్ రూ.50 కాగా, కిలో రూ.260 కాగా బుట్ట సైజ్‌ను బట్టి రూ.600 నుంచి రూ.1000 వరకు ధర పలుకుతుంది. టమాటా కిలో రూ.80, కాగా బుట్ట రూ.400 నుంచి రూ.500 వరకు ధర ఉంది. చిక్కుళ్లు, బీన్స్ కిలో రూ.60 కాగా బుట్ట రూ.300 వరకు ధర ఉంది.క్యారెట్ కిలో రూ.50, వంకాయలు కిలో రూ.70, మిరప కిలో రూ.90 చొప్పున ధరలకు అమ్మకాలు జరిగాయి. కూరగాయలను మంచి లాభదాయకమైన ధరలకు కొనుగోలు జరగడంతో రైతులకు లాభాలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది కూరగాయల సాగు దిగుబడి రావడంతో పాటు లాభాలు రావడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేశారు.

వ్యాపారం బాగుంది

ప్రస్తుతం వారపు సంతల్లో కూరగాయల వ్యాపారం జోరుగా సాగుతుంది. మైదాన ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. గతంలో కంటే ప్రస్తుతం మంచి ధరలకు కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. రానున్న రోజుల్లో ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉంది. సంతల్లో సిండికేట్ వ్యాపారుల బెడద వేధిస్తోంది.
– గాసి, రైతు, ముంచంగిపుట్టు


విక్రయిస్తున్న మిరప


సంతలో అమ్మకానికి తీసుకొచ్చిన చిక్కుళ్లు

పుస్తక పఠనం అలవర్చుకోవాలి


చింతపల్లి డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ విజయభారతి


దుంబ్రిగుడలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న గ్రంథాలయాధికారి సునీత

చింతపల్లి: పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయభారతి అన్నారు. మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు రోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదివితే జ్ఞానం పొందవచ్చన్నారు. వైస్ పిన్సిపాల్ ఎల్.పాత్రుడు, అధ్యాపకులు డాక్టర్ కెజియా, లీలాపావని, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

దుంబ్రిగుడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో శనివారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థులు , బాలికల పాఠశాల విద్యార్థులు సుమారు 40 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి ఎస్.సునీత మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు అన్ని కేరీర్ గైడెన్స్ తదితర అంశాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుబ్బారావు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి అనర్థాలపై అవగాహన


లక్ష్మీపురంలో కళాజాత నిర్వహిస్తున్న కళా మండలి సభ్యులు

ముంచంగిపుట్టు: జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మండలంలోని లక్ష్మీపురం, బుంగాపుట్టు, బరడ, మాకవరం పంచాయతీల్లో పలు గ్రామాల్లో కళాజాత కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలపై బుర్రకథ రూపంలో కళాకారులు అవగాహన కల్పించారు. గంజాయి కేసుల్లో చిక్కుకొని జీవితాలు నాశనమవుతున్న వైనాన్ని పాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. వాణిజ్య పంటలైన కాఫీ, మిరియాలు, పసుపు తదితర పంటలు సాగుతో గిరిజన రైతులు ఆర్థికాభివృద్ధి పొందవచ్చన్నారు. యువత డ్రగ్స్ బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. గిరిజనులకు పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు గంజాయి వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో కళాజాత నిర్వహించి, గిరిజనులకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. సర్పంచులు త్రినాథ్, గంగాధర్, నోబిన, పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా బాబా పల్లకీ సేవ


సాయిబాబా పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో షిర్డీ సాయిబాబా పల్లికీ సేవ శనివారం వైభవంగా జరిగింది. పూలతో అలంకరించిన పల్లకిలో బాబా చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. నేడు బాబా మందిరం వార్షికోత్సవం మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిర వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. బాబా వారికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం జరుపుతున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

గత్తరజిలడలో అధ్వాన రహదారితో ఇక్కట్లు


గత్తరజిలడలో మట్టి రోడ్డు

దుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ గత్తరజిలడలో సీసీ రోడ్లు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అరకు– కొల్లాపుట్లు మీదుగా ఒడిశా వెళ్లే బీటీ రోడ్డుకు అనుకొని గత్తరజిలడ గ్రామం ఉంది. ఈ గ్రామానికి రహదారి లేక స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షంపడితే రహదారి చిత్తడిగా మారుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన దారి లేకపోవడంతో 108, 104 సేవలు అందడం లేదంటున్నారు. రవాణా సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నాని చెబుతున్నారు.
గ్రామంలో సీసీ రోడ్డు నిర్మించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని సర్పంచ్ దొన్ను చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక

మారేడుమిల్లి: స్థానిక ఎంపీపీ పాఠశాలలో యూటీఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశంలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా జి.విశ్వరాజు, పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు వై.విల్సన్ బాబు హజరైయ్యారు. మండల నూతన కార్యవర్గ గౌరవ అధ్యక్షుడిగా కె.ఆంధ్రయ్య. సహా అధ్యక్షులుగా ఎం.సాయిబాబా, ఎల్.దయామణి, అధ్యక్షుడిగా డి.మహేష్, ప్రధాన కార్యదర్శిగా కె.కృష్ణారెడ్డి, కోశాధికారి కె. పండయ్య, కార్యదర్శులుగా వి.అబ్బాస్, సీహెచ్. సూర్యనారాయణ రెడ్డి, వై.దుర్గా వెంకటరెడ్డి, వి. రాజారెడ్డి, పి. సిరి శేషకుమారి, మండల ఆడిటర్‌గా ఎం.జగ్గజీవన్ , కుటుంబ సంక్షేమ బాధ్యులుగా జి.త్రినాథ్, ప్రతిక కార్యదర్శిగా డి.చంద్రశేఖర్, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పాస్టర్‌లకు బ్యాగుల పంపిణీ


పాడేరులో పాస్టర్‌లకు బ్యాగ్‌లు పంపిణీ చేస్తున్న ఏఐటీసీసీ ప్రతినిధులు

పాడేరు రూరల్(హుకుంపేట): పాడేరులోని ద కాలేక్ ఆఫ్ బైబిల్ టెక్నాలజీ కళాశాలలో ఆల్ ఇండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ మహిళ విభాగం ఆధ్వర్యంలో బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ జయశాలి పి.డి.సుందరరావు చేతులమీదుగా దైవ సేవకులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.అశ్విన్ మాట్లాడుతూ ఏఐటీసీసీ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. సంస్థ సిబ్బంది రాజమ్మ, దీనా, సరోజిని, సుశీల, విజయకుమారి, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీపై దాడి: ఇద్దరి అరెస్టు

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ, రాజుపేటలో నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి జరిపినట్టు ఎస్ఐ ఈ.నరసింహమూర్తి శనివారం తెలిపారు. బట్టి వద్ద లభించిన పది లీటర్ల సారా స్వాధీనం చేసుకొని, సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన వంద లీటర్ల ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ నరసింహమూర్తి చెప్పారు. ఇందులో ఇద్దరు వ్యక్తులు పట్టుబడగా వారిని అడ్డతీగలలోని జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఎవరైనా సారా విక్రయించినా, తయారు చేసినా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకొంటామని ఎస్ఐ నరసింహమూర్తి హెచ్చరించారు.

సత్య దీక్షల ఇరుముడులకు ఏర్పాట్లు


తణుకు వెంకటరామయ్య

అడ్డతీగల: సత్య దీక్షలు చేస్తున్న భక్తులు దీక్ష విరమణ కోసం నిర్వహించే ఇరుముడుల స్వీకరణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య తెలిపారు. ఈనెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 7 గంటలకు అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో ఇరుముడుల స్వీకరణ కార్యక్రమం మొదలుపెడతామన్నారు. ఇరుముడుల అనంతరం అన్నప్రసాదం స్వీకరించి వెంటనే అన్నవరం దేవస్థానానికి బయలుదేరాలని చెప్పారు. అందరూ సహకరించి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. మూడో విడత సత్య దీక్షలు స్వీకరణ కార్యక్రమం ఇటీవల జరిగినట్టు పేర్కొన్నారు. తొమ్మిది రోజులు దీక్ష తీసుకునే భక్తులు మాలధారణ చేస్తారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి


లోతుగెడ్డలోని పాఠశాలను సందర్శించిన జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య

మారేడుమిల్లి : విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని మండల విద్యాశాఖాధికారి తాతాబ్బాయి దొర అన్నారు. మండలంలోని కొడవటిలంక, పీజీ లంక, గూరిమామిడి, తాడేపల్లి, మల్లవరం, నీలవరం పాఠశాలలను ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు శ్రద్ధగా చదవాలని సూచించారు. పాఠశాల పరిసరాలు ఎప్పుటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని ద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు.

చింతపల్లి: మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు పొందవచ్చని జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య చెప్పారు. మండలంలోని పెదబరడ పంచాయతీ పరిధిలోని లోతుగడ్డ జంక్షన్‌లో సర్పంచ్ సమిడి గోపాల్‌తో కలిసి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయి మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ దేవత ఈశ్వరమ్మతల్లి ఆలయాన్ని పరిశీలించారు. మాజీ ఎంపీపీ లక్ష్మయ్య, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణారావు, గ్రామ పెద్దలు రామకృష్ణ, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం మోసం


మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు అప్పలనర్స

అనంతగిరి(అరకులోయ రూరల్): బూటకపు హామీలతో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ప్రజలకు నిలువుగా మోసం చేసిందని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స చెప్పారు. మండల కేంద్రంలో సీపీఎం మండల మహాసభ శనివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అమలుచేయడం లేదన్నారు. ఎన్నికల ప్రచారంలో అరకులో జరిగిన సభలో గిరిజన నిరుద్యోగుల కోసం ప్రత్యేక డీఎస్సీ ప్రకటిస్తానని చంద్రబాబు ప్రకటించి, ముఖ్యమంత్రి పదవీ అలంకరించిన తరువాత గిరిజనులకు తీరని మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో ప్రకటనలు గుప్పించి, నేటి వరకు ఒక్క హామీ అమలుచేయలేదని ధ్వజమెత్తారు. ఎన్నికల హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయని ఘనత కూటమి ప్రభుత్వమేదేనని స్పష్టం చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు కిల్లో సురేంద్ర, జెడ్పిటీసీ సభ్యుడు గంగరాజు, నాయకులు కొండలరావు, నాగులు, మోస్య, దేముడమ్మ, కాసులమ్మ, వెంకటరమణ, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా వన సమారాధన


చింతపల్లి వనసమారాధనలో విద్యార్థుల సందడి


యర్రగొండలో విద్యార్థుల నృత్యాలు

చింతపల్లి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల విద్యార్థుల వనసమరాధన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. కొత్తవీధి కాఫీతోటలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం నుంచి విద్యార్థులు ఆటపాటలు, డ్యాన్సులు, థింసా నృత్యాలతో సందడి చేశారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు కలిసి సహపంక్తి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ గోవింద్, వార్డెన్లు వినాయకరావు, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండలోని గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తహసీల్దార్ పి.వేణుగోపాల్, స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్, డాక్టర్ చైతన్య, ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలు శాఖల సిబ్బంది, అధ్యాపకులు, ఉపాధ్యాయులు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. విద్యార్థినుల తల్లిదండ్రులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన అధికారులు, వైద్యులు

రహదారుల నిర్మాణానికి వినతి


ఎంపీడీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎటపాక: మండలంలోని గుండాల, రాయనపేట గ్రామ పంచాయతీల్లో అంతర్గత రహదారులు నిర్మించాలని కోరుతూ సీపీఎం నాయకులు శనివారం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ గుండాల గ్రామంలోని జాతీయ రహదారి నుంచి ఎర్రబోరు వెళ్లే రహదారితో పాటు కె.ఎన్. పురం నుంచి సెయింట్ ఆన్స్ స్కూల్ వరకు బీటి రహదారి అధ్వానంగా ఉందని, వెంటనే రహదారుల నిర్మాణం చేపట్టాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నేతలు సత్యం, సుధాకర్‌రావు, ప్రవీణ్ తదితరులున్నారు.

జల్లూరులో న్యాయ విజ్ఞాన సదస్సు


జల్లూరులో న్యాయ విజ్ఞాన సదస్సులో అవగాహన కల్పిస్తున్న పారా లీగల్ వలంటీర్లు

అడ్డతీగల: మండలంలోని జల్లూరులో న్యాయ సేవాధికార సంస్థ సీనియర్ పారా లీగల్ వలంటీర్ల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా లీగల్ వలంటీర్ తీగల బాబూరావు మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. గిరిజనులకు అవసరమైన న్యాయ సేవలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ గ్రామానికి అంగన్‌వాడీ వర్కర్లు రెండు, మూడు సార్లు మాత్రమే వచ్చి గుడ్లు, పౌష్టికాహారం అందిస్తున్నారని, పొరుగున నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న దుప్పలపాలెం వెళ్లాల్సి వస్తోందని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌తో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించామన్నారు. పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.